క్లుప్తంగా

దొనకొండలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దొనకొండ: దొనకొండలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ షేక్ నాగూర్‌వలి తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

పల్లె పోలేరమ్మ తల్లికి ఘనంగా పూజలు


పూజలు అందుకుంటున్న పల్లె పోలేరమ్మ తల్లి

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువు గ్రామ పొలిమేరలో వెలసిన శ్రీ పల్లె పోలేరమ్మ తల్లికి భక్తులు ఆదివారం ఘనంగా పూజలు చేశారు. ఇండ్లచెరువు గ్రామానికి చెందిన యాదవులు ప్రతి ఏడాది శ్రావణ మాసంలో పూజలు నిర్వహిస్తారు. అందులో భాగంగా వారు పిల్లాపాపలతో కలిసి నైవేద్యాలు చేసి అమ్మవారికి సమర్పించారు. వర్షాలు సకాలంలో పడాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలో సోమవరప్పాడు గ్రామంలో ప్రసిద్ధగాంచిన పుణ్యక్షేత్రమైన గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. పూజారులు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మిలు అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ బ్రాహ్మణ అర్చకుడు కామేశ్వరశర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పుట్ట, నాగశిలలు, మల్లికార్జునస్వామికి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన వసతులను ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్‌కే ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.


వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరిన నాయకులు, కార్యకర్తలు


దోర్నాల వీధుల్లో రెప రెపలాడుతున్న వైఎస్సార్ సీపీ జెండాలు

నల్లమలలో మార్మోగిన జగన్ నినాదం

- పెద్దదోర్నాలలో రెపరెపలాడిన వైఎస్సార్ సీపీ జెండాలు
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సభకు భారీగా తరలి వచ్చిన జనం
- ఎమ్మెల్యే తాటిపర్తి ప్రసంగంతో కార్యకర్తల్లో రెట్టించిన ఉత్సాహం


వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: నల్లమల అటవీ ప్రాంతమైన పెద్దదోర్నాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నినాదం మార్మోగింది. శ్రీశైల క్షేత్ర ముఖద్వారంలో వైఎస్సార్ సీపీ జెండాలు రెప రెపలాడాయి. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ నాయకత్వంలో దోర్నాలలో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి మండల నలుమూలల నుంచి ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నల్లమల అడవుల్లో నివశించే గిరిజనులు సైతం ఎంతో హుషారుగా పార్టీ జెండాలను పట్టుకొని జగన్ నినాదంతో పరుగులు తీసుకుంటూ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ప్రజలను చూసి కూటమి నాయకులు గుండెలు బాదుకున్నారు. ఇటీవల టీడీపీ నాయకులు తలపెట్టిన ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణకు ప్రజా బలం చూపించుకునేందుకు డ్వాక్రా మహిళలను బలవంతంగా తరలించుకొని కార్యక్రమాన్ని మమ అనిపించుకోవాల్సి వచ్చిందని పచ్చనేతలు గుసగుసలాడుకుంటున్నారు. ముందుగా మార్కాపురం రోడ్డులోని మార్కెట్ యార్డు వద్ద ఎమ్మెల్యే తాటిపర్తికి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా పట్టణ నడిబొడ్డున ఉన్న నటరాజ్ సెంటర్ వద్దకు చేరుకున్నారు. అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బైక్‌లపై ర్యాలీగా శ్రీశైలం రోడ్డులోని మల్లికార్జున ఎస్టేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సభ ప్రారంభంలోనే జగనన్న జిందాబాద్, తాటిపర్తి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ దిక్కులు పిక్కటిల్లేలా కార్యకర్తలు నినాదాలు చేశారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతున్నంత సేపు సభికులు హుషారుగా చప్పట్లు కొట్టారు. బాబు మోసపు మాటలు మాట్లాడకు, ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చు, లేకుంటే గద్దెదిగి వెళ్లిపో, జగనన్నే మళ్లీ రాష్ట్ర పగ్గాలు చేపట్టాలి, రాష్ట్రంలో రావణ రాజ్యం అంతరించి రామ రాజ్యం రావాలంటూ నినాదాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు గంటా వెంకటరమణారెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మజీద్, రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షులు దొండేటి నాగేశ్వరరెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి గుమ్మా పద్మజా యల్లేష్, వివిధ విభాగాల నాయకులు ఏకుల ముసలారెడ్డి, ఉడుముల అరుణమ్మ, భూమిరెడ్డి సుబ్బారెడ్డి, ఆర్.అరుణాబాయి, దుమావత్ లతా చంద్రకాంత్ నాయక్, దూదేకుల రసూల్, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, షేక్.షెక్షావలి, అల్లు రాంభూపాల్‌రెడ్డి, ఒంటేరు నాగేశ్వరరావు, చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, గుండారెడ్డి రమణారెడ్డి, బొగ్గరపు రమేష్, లాలు నాయక్, యక్కంటి మల్లారెడ్డి, సర్పంచ్‌లు వెంకటరామయ్య, పవన్‌కుమార్, యోహాన్, కోటిలింగం, ఆవుల కోటి వీరారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వినాయక, పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


తలపై బోనాలతో మొక్కులు తీర్చుకునేందుకు తరలిన మహిళలు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని ఐనముక్కలలో వెలసిన వినాయక, పోలేరమ్మ, ఆంజనేయస్వామి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని ఆదివారం గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్న గ్రామానికి సంబంధించిన వారందరూ కార్యక్రమానికి హాజరు కావటంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయం ముందు చలువ పందిళ్లు ఏర్పాటు చేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మేళతాళాలు, అర్చకుల వేదమంత్రాల నడుమ భక్తులు తలపై బోనాలతో అమ్మవారికి సమర్పించుకున్నారు. ఆలయ పూజారి కాకర్ల లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో కళాన్యాస హోమం, యంత్ర స్థాపన, శిలా స్థాపన, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటా


పార్టీ నాయకుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

- పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను పరామర్శించిన ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

తాళ్లూరు: మండలంలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. తూర్పుగంగవరం గ్రామానికి చెందిన సొసైటీ మాజీ సభ్యుడు యాడిక యలమందారెడ్డి ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. అతనితో పాటు పక్షవాతంతో బాధపడుతున్న పార్టీ సీనియర్ నాయకుడు నగుళ్ల పాపయ్య నివాసానికి వెళ్లి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన పార్టీ మండల కార్యదర్శి భీమని సుబ్బారావు కడుపునొప్పితో ఆపరేషన్ చేయించుకోవడం, గుజ్జుల వెంకటేశ్వరరెడ్డి (గోల్డ్) మాతృమూర్తి జి.అంకమ్మ వెన్నెముక ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలుసుకుని వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, ధైర్యంగా ఉండాలని, ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే, తాళ్లూరులోని పార్టీ సీనియర్ నాయకుడు కోటా కృష్ణారెడ్డి మాతృమూర్తి హనుమమ్మ దశదిన కార్యక్రమానికి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బూచేపల్లి వెంట పార్టీ మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోళ్లపాటి మోషే, మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు లతీఫ్, నగళ్ల గోపి, నారాయణశెట్టి, మండల నాయకులు యత్తపు మధుసూదన్‌రెడ్డి, కె.ఎస్.శ్రీనివాసరావు, పి.దేవదానం, నాగమల్లేశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, లతీఫ్, ఎస్.కొండారెడ్డి, గోపు శ్రీను, బాలకృష్ణారెడ్డి, తూము జయరామిరెడ్డి, సైదా, జి.వెంకారెడ్డి, పి.కోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వానొస్తే అడుగేయలేం


పోతంపల్లి గ్రామంలో రోడ్డు దుస్థితి

పెద్దారవీడు: మండల పరిధిలోని పోతంపల్లి గ్రామంలో రోడ్డు దెబ్బతిని అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షానికి నీరు రోడ్డుపై చేరి ప్రజలకు ఇబ్బందిగా ఉంది. అలాగే గ్రామం మీదుగా రేగుమానిపల్లి గ్రామానికి వెళ్లాలంటే నిత్యం ప్రజలు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామం నడిబొడ్డున వర్షం కురిస్తే బురదమయంగా మారి రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. ఎప్పుడు వాన వచ్చినా రోజుల తరబడి బురదలో రాకపోకలు సాగించాల్సిందేనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేసి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దేవాలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో వేనూతల కాటమరాజుస్వామి

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగాభవానీ, వేనూతల కాటమరాజుస్వామి, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన నాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. ఆలయాల ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవార్లకు చెల్లించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించారు.

వైఎస్సార్ సీపీ నాయకుని తల్లికి నివాళులు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండలంలోని మైనంపాడులో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకుడు పెరుగు సుబ్బారావు తల్లి రత్తమ్మ సంస్మరణ సభ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు మాదాల వెంకట్రావు, నాయకులు మాచవరం వెంకట్రావు, పెరుగు సుబ్బారావు, తదితరులు రత్తమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఒంగోలు పర్యటనను విజయవంతం చేయండి

దర్శి: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ ఈ నెల 7వ తేదీ ఒంగోలు పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాడపాకుల శ్రీనివాసులు కోరారు. నియోజకవర్గంలోని బీజేపీ మండల అధ్యక్షులతో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. దర్శి రూరల్, కురిచేడు, తాళ్లూరు, ముండ్లమూరు, దొనకొండ మండలాల అధ్యక్షులు కాకర్ల నాగసాయి, కురంగి నాగేశ్వరరావు, వేమారెడ్డి పిచ్చయ్య పాల్గొన్నారు.


పుల్లలచెరువులో సాగు చేసిన బొప్పాయి పంట


వెంకటరెడ్డిపల్లిలో సాగు చేసిన అరటి తోట

ప్రత్యామ్నాయం వైపు రైతుల చూపు

- పత్తి, మిరప సాగుతో నష్టాలు
- అరటి, మొక్కజొన్న, బొప్పాయి సాగుకు మొగ్గు


పీవీపల్లిలో సాగు చేసిన మొక్కజొన్న పంట

పుల్లలచెరువు: పుల్లలచెరువు మండలంలోని పలు గ్రామాల్లో నల్లరేగడి, ఎర్రనేల భూములు ఎక్కువగా ఉన్నాయి. దీంతో రైతులు ఏడాదిగా ఎక్కువగా పత్తి, మిరప పంటలు సాగు చేసి మంచి దిగుబడులు సాధించారు. ప్రస్తుతం వాటికి గిట్టుబాటు ధరలు లేకపోవడం, తెగుళ్ల బెడద పెరగడంతో రైతుల ఆలోచన మారింది. ఐదారేళ్లుగా పత్తికి గులాబీ పురుగు వ్యాప్తి చెంది దెబ్బతీసింది. మిరపలో జెమినీ వైరస్, నల్లనల్లి వ్యాప్తి చెంది పంటలను తొలగించే పరిస్థితి ఏర్పడింది. దీంతో అన్నదాతలు నష్టాలను చవిచూస్తున్నారు. ఈ ఏడాది ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టారు. కాలువ, నీరు ఉన్న ప్రాంతాల్లో వరి పంట సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మెట్ట, కొందరు రైతులు మొక్కజొన్న, బొప్పాయి, అరటి, సజ్జ పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

చాలా గ్రామాల్లో రైతులు గతంలో వేసిన పంటలకు భిన్నంగా పంటలను మార్చేసేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అరటి, మొక్కజొన్న, బొప్పాయి పంటలు సాగు చేసేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు. పుల్లలచెరువు మండలంలో మొక్కజొన్న 130 హెక్టార్లు, కంది 12, బొప్పాయి 100, అరటి 20 హెక్టార్లలో ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్నారు. కంది సాగు విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

> **కూలీల కొరతతో ఇబ్బందులు**
> నాకు 15 ఎకరాల పొలం ఉంది. గతంలో మిర్చి, పత్తి పంటలు సాగు చేశాను. పత్తిలో గులాబి పురుగు, మిర్చిలో తెగుళ్లతో పెట్టుబడి పెరిగింది. కొన్ని సందర్భాల్లో గిట్టుబాటు ధర లేదు. మిరప కోతల సమయంలో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. అందుకే చాలా వరకు వ్యవసాయం తగ్గించి పది ఎకరాల్లో బొప్పాయి, అరటి పంటలు సాగు చేస్తున్నా. అధికారులు గ్రామాల్లో పర్యటించి తగు సూచనలు ఇస్తే వ్యాపార పంటల సాగు చేసే విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.
> – కొత్త చిన్నా, రైతు, పుల్లలచెరువు

> **కంది 5, సజ్జ 5 ఎకరాలు సాగు చేస్తున్నా**
> మాది నల్లరేగడిపాలెం. గతంలో పత్తి, మిరప పంటలను ఎక్కువ సాగు చేశాను. తెగుళ్లు, గిట్టుబాటు ధరలు లేక నష్టాలు రావడంతో పెట్టుబడులు కూడా రావడం లేదు. దీంతో ఖరీఫ్‌లో కంది, సజ్జ పంటలు సాగు చేయాలని నిర్ణయించుకున్నా.
> – వెంకటేశ్వరరెడ్డి, గంగవరం.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

ఒంగోలు మెట్రో: ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఒంగోలు రంగారాయుడు చెరువు దగ్గర బ్రాహ్మణ సేవా సమితి శుభప్రద కమ్యూనిటీ భవనంలో మహంకాళి వెంకట శేషయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. లయన్స్ క్లబ్, గుడ్ గవర్నెన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రముఖ ఆర్‌ఎంపీ డాక్టర్ హనుమంతరావు, కొల్లా వెంకయ్యలను మహంకాళి వెంకటశేషయ్య, వారి మిత్ర బృందం ఘనంగా సత్కరించారు. ముందుగా స్నేహితులందరూ ఒకచోట కలిసి వారి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ రంగనాథం, రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ కంచర్ల సుబ్బారావు, ఓరుగంటి ప్రసాద్, రిటైర్డ్ టీచర్ సముద్రాల సుబ్రహ్మణ్యం, ప్రముఖ వ్యాపారవేత్త తాతా శ్రీనివాసులు, గుంజి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఏసోబుకు ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

దర్శి: గుండె ఆపరేషన్ చేయించుకుని ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మండలంలోని తూర్పుచౌటపాలెం గ్రామానికి చెందిన ఏసోబుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో రూ.5000 సాయం చేశారు. దాతల సహకారంతో వచ్చిన మరో రూ.22 వేలు కలిపి మొత్తం రూ.27 వేలను ఆదివారం అందజేశారు. వారికి ఏసోబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, వైస్ చైర్మన్ వాకా జనార్దన్‌రెడ్డి, కన్వీనర్ ధనిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, అధ్యక్షుడు సీహెచ్ బసవయ్య, ప్రధాన కార్యదర్శి జీ వేణు, ట్రెజరర్ తిరుపతిరెడ్డి, గౌరవాధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, హెల్త్ మెంబర్ సుశీల, సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వరరెడ్డి, వెంకటరావు, సుధాకర్‌రావు, కరుణానిధి, తదితరులు పాల్గొన్నారు.